ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

ఆదివారం 25 మే 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760

ధర్మవరం, పుట్టపర్తి : 9963160529

కదిరి :9052518170

ఏసీఎం: 9985411154

మినీ మహానాడుకు హాజరైన కార్యకర్తలు



మీరే పార్టీ బలం

జెండా మోసిన కార్యకర్తలకు గుర్తింపు

అక్రమ కేసుల మాఫీపై త్వరలో నిర్ణయం

అభివృద్ధిలో జిల్లాను అగ్రపథంలో నిలుపుదాం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అట్టహాసంగా జిల్లా మినీ మహానాడు

పుట్టపర్తి, మే24(ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం. మీకష్టంతోనే పార్టీ నిలబడింది. జెండా మోసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇచ్చి, నామినేటెడ్ పదవులతో సముచిత స్థానం కల్పిస్తాం. మీ కష్టాల్లో తోడుగా ఉంటాం' అంటూ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. అభివృద్ధిలో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపి, అందరికీ సంక్షేమాన్ని కొనసాగిస్తామన్నారు. జిల్లా కేంద్రం కప్పలబండ పారిశ్రామిక పార్కులో శనివారం జిల్లా మినీ మహానాడు సభను అట్టహాసంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అధ్యతన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్‌రాజు, పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత సభ వేదిక వద్ద టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గత రెండేళ్లలో మరణించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన మురళీనాయక్‌కు నివాళులర్పించారు. కాగా మినీ మహానాడుకు జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వైసీపీ నాయకులు గత ఐదేళ్లు టీడీపీ శ్రేణులను తీవ్ర ఇబ్బందులు పెట్టారని ధర్మవరం నియోజక వర్గ నాయకులు సభలో వాపోయారు. వారు ఇప్పుడు రక్షణ కోసం బీజేపీ, జనసేన ముసుగులు వేసుకుని, మళ్లీ అధికారం చెలాయించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మవరంపై జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు చొరవచూపి కార్యకర్తలను రక్షించాల్సిన అవసరం ఉందని విన్నవించారు.



మాట్లాడుతున్న మంత్రి సవిత



ఈల వేస్తున్న మహిళా కార్యకర్త

ఎన్టీఆర్ వల్లే బడుగులకు రాజ్యాధికారం

మంత్రి సవిత మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఘనత దివంగత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆయన స్ఫూర్తిని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కొనసాగిస్తూ టీడీపీని బలోపేతం

(మిగతా 6వ పేజీలో)

చురుగ్గా అదానీ ప్రాజెక్టు పనులు

అదనంగా 12.87 ఎకరాల భూమి కేటాయింపు

తాడిమర్రి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో అదానీ పవర్‌ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతునానయి. మండల సరిహద్దులో 406 ఎకరాలలో దాదాపు రూ.3వేల కోట్ల వ్యయంతో అదానీ కంపెనీ హైడల్ పవర్ ప్రాజెక్టును చేపట్టిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ప్రభుత్వం అదనంగా 12.87 ఎకరాల భూములు కేటాయించిన సంగతి తెలిసిందే. పెద్దకోట్ల, దాడితోట గ్రామాల సరిహద్దుల్లోని 615 సర్వే నెంబరులో 8.35 ఎకరాలు, సర్వేనెంబర్ 616లో 4.5 ఎకరాలు మొత్తం 12.87 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ మంత్రి మండలి సమావేశంలో తీర్మానించారు. ఈ భూ కేటాయింపులు గత ప్రభుత్వ హయాంలో పంపిన ప్రతిపాదనలను అనుసరించే చేసినట్లు తెలిసింది. ఎకరానికి రూ.5లక్షలు చొప్పున ప్రభుత్వానికి అదానీ కంపెనీవారు చెల్లించాల్సి ఉంటుంది. అయితే రెవెన్యూ అధికారులు ఆ భూమి ఎక్కడ వస్తుంది, ఎటు వైపు వస్తుందన్న విషయాన్ని చెప్పలేకపోతున్నారు. అదానీ పవర్ ప్రాజెక్టు సమీపంలోని పుల్లట్ల కనుమ వద్ద కేటాయించినట్లు చెబుతున్నారు. అయితే ఇక్కడ చుట్టు కొండ ఉండగా అది రాళ్లు, గుట్టలు కలిగి ఉంది. ఈ కనుమ గుండానే అనంతపురం నుంచి పులివెందుల వైపు వందల వాహనాలు వెళ్తుంటాయి. ఇక్కడ కొండను తవ్వేందుకు పేలుళ్లు జరిపితే వాహనదారులకు ఇబ్బందులు తప్పవు. వాటిని అధిగమించడానికి అదానీ పవర్ వారు, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



చురుగ్గా సాగుతున్న పనులు

ఆకట్టుకున్న అవతార సంకల్పం



విద్యార్థుల నృత్యం



అవతార సంకల్పం నాటికలోని ఓ సన్నివేశం

పుట్టపర్తి, మే 24(ఆంధ్రజ్యోతి): ఒడిశా భక్తులు చేపట్టిన సంగీతసాంస్కృతిక కార్యక్రమాలు సత్యసాయి భక్తులను అలరించాయి. పర్తియాత్ర పేరుతో ఒడిశా రాష్ట్రానికి చెందిన 3500 మంది భక్తులు శనివా రం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయికుల్వంతు సభా మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అవతార సంకల్పం పేరిట చేపట్టిన నాటిక భక్తులను ఆకట్టుకుంది. గంటపాటు సంగీత గానంతో భక్తులను మైమరపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఎడ తెగని బదిలీ సమస్యలు...!

- క్యూ కడుతున్న టీచర్లు, సంఘాల నేతలు
- సీనియారిటీ జాబితాపై స్పష్టత ఇవ్వని అధికారులు
- డీఈఓల మధ్య కొరవడిన సమన్వయం
- శ్రీసత్యసాయి అధికారుల పాత్ర నామమాత్రం

6

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అల్ట్రాసౌండ్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. లింగనిర్ధారణ నిషేధ చట్టం అమలుపై శనివారం కలెక్టరేట్‌లో హిందూపురం అదనపు కోర్టు న్యాయాధికారి కె. శైలజతో కలిసి జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భస్థ శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉందన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖ, మెప్మా, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ శాఖలతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థల సమన్వయంతో లింగనిర్ధారణపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హిందూపురం అదనపు కోర్టు న్యాయాధికారి కె. శైలజ మాట్లాడుతూ.. జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ కేంద్రాలపై దాడులు చేసి, చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా సరిహద్దున కర్ణాటక రాష్ట్రం ఉండడంతో అక్కడ కూడా లింగనిర్ధారణ పరీక్షలు జరిగే అవకాశముందని, దీనిపై గట్టినిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఫిరోజ్‌బేగం, డీఐఓ శ్రీనివాసరెడ్డి, జిల్లా నర్సింగ్ అధికారి వీరమ్మ, బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి డైరెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్



జిల్లాలోని ధర్మవరం కొత్తపేటకు చెందిన చేనేత కార్మికుడు చంద్రశేఖర్ కుటుంబం వారి తాతల కాలం నుంచి చేనేతనే నమ్ముకుని జీవనం సాగిస్తోంది. చేనేత పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం వల్ల ఉన్న రెండు సొంత మగ్గాలను అమ్ముకుని కూలి మగ్గానికి వెళ్లారు. అక్కడ కూడా గిట్టుబాటు కాక పోవడంతో కుటుంబపోషణ, పిల్లల చదువుల కోసం అప్పులు చేశాడు. కూలి మగ్గం ద్వారా వచ్చిన సొమ్ము కుటుంబ పోషణకే సరిపోలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, అప్పులు ఇచ్చినవారి వేధింపులు భరించలేక ఈ నెల 13న ఇంటిలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది ఒక్క చంద్రశేఖర్ దీనస్థితే కాదు ఇలాంటి వాళ్లు జిల్లాలో వేలాది మంది ఉన్నారు.

నేతన్నను దెబ్బతీస్తున్న పవర్‌లూమ్స్

- గిట్టుబాటు ధర లేక చేనేత కుదేలు
- అప్పులతో కుటుంబ జీవన పోరాటం
- రెండేళ్లలో 20 మంది బలవన్మరణం
- చేయూత ఇవ్వని ప్రభుత్వ విధానాలు
- ప్రశ్నార్థకంగా చేనేత కార్మికుడి పరిస్థితి

చేనేతపై చావు మరక



● మగ్గాలను చుట్టేశా

నేను చిన్నప్పటి నుంచి మగ్గం నేసేవాడిని. రానురాను ముడిసరుకుల ధరలు పెరగడంతో పాటు నేసిన చీరలకు గిట్టుబాటు లభించలేదు. దీంతో ఉన్న రెండు మగ్గాలను ఐదేళ్ల కిందటే చుట్టేశా. అప్పటి నుంచి టీస్టాల్‌ను ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ప్రస్తుతం జీవనం సాఫీగా సాగిపోతోంది.

- చంటి, టీస్టాల్ నిర్వాహకుడు, శాంతినగర్



చుట్టేసిన మగ్గం

ధర్మవరం, మే24(ఆంధ్రజ్యోతి): మరమగ్గాల దెబ్బకు చేనేత పరిశ్రమ చితికిపోతోంది. పవర్‌లూమ్స్ దెబ్బకు అనేకమంది చేనేతలు చేస్తున్న వృత్తిని వదిలేసి ఇతర పనుల్లోకి వెళుతున్నారు. మరి కొందరు చేసిన అప్పులు తీర్చేమార్గం కానరాక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. గత రెండేళ్లలోనే 20 మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించడంలో కూడా కాలయాపన చేయడం తప్పా ప్రభుత్వం చేసింది ఇప్పటివరకు శూన్యం. చేనేత పరిశ్రమ అంటేనే మొదట గుర్తు వచ్చేది ధర్మవరం. ఇక్కడ తయారు చేసే చీరలకు దేశ విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. అంత ప్రసిద్ధి గాంచిన చేనేత పరిశ్రమ ప్రస్తుతం అంపశయ్యపై ఉంది. పవర్‌లూమ్స్ ఉత్పత్తులు పెరుగుతుండటంతో నేతన్నలకు కష్టాలు మొదలయ్యాయి.

70 వేల నుంచి 30 వేలకు ..

ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో 70వేల మగ్గాలు ఉండేవి. ముడిసరుకుల ధరల్లో వ్యత్యాసాలు రావడం, గిట్టుబాటు ధరలేక ఎందరో నేతన్నలు మగ్గాలను చుట్టేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30వేల మగ్గాలు మాత్రమే ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 18వేల మగ్గాలు ఉన్నాయి. మూడేళ్ల కిందట వార్పు రూ.3300, రేషం రూ.3వేలు ఉండగా ప్రస్తుతం వార్పు రూ.6వేలు, రేషం రూ.5500 ఉంది. చేనేత కార్మికుడు నేసిన చీరకు ఆరేళ్ల నుంచి రూ.3వేల నుంచి రూ.6వేల వరకు మాత్రమే ధర లభిస్తోంది. గతంలో పనిముట్లు, ముడిసరుకులపై సబ్సిడీ, నేత కార్మికులకు రుణాలు అందజేసేవారు. వైసీపీ పాలనలో వీటన్నింటికీ మంగళం పాడారు. సొంత మగ్గం ఉన్నవారికి మాత్రమే ఏడాదికి నేతన్న నేస్తం కింద రూ.24వేలు ఇచ్చారు తప్ప, నేతన్నకు ఎటువంటి ప్రోత్సాహం ఇవ్వలేదు. ఎన్నికల ముందు టీడీపీ కూడా చేనేతలకు అనేక హామీలు ఇచ్చింది. అయితే ఏడాదికావస్తున్న ఇంతవరకు ఒక్క200 యూనిట్లు ఉచిత కరెంటు తప్ప ఏ హామీ నెరవేర్చలేదని చేనేత కార్మికులు వాపోతున్నారు.



పట్టు చీరలు

పవర్‌లూమ్స్‌తో కష్టాలు

వైసీపీ ప్రభుత్వం పవర్‌లూమ్స్ ఏర్పాటుకు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడంతో చేనేత మగ్గాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకచేనేత కార్మికుడు మగ్గంపై ఒక చీరను తయారు చేయాలంటే కనీసం నాలుగు రోజుల సమయం పడుతుంది. అదే పవర్‌లూమ్స్‌లో రోజుకు నాలుగైదు చీరలు తయారు చేసే అవకాశం ఉంది. ఈ పోటీని నేతన్నలు తట్టుకోలేక మగ్గాలను మధ్యలో వదిలేసి ఇతర వృత్తుల వైపు తరలిపోతున్నారు. నిరోధించాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాస్టర్‌వీవర్స్‌కు లొంగిపోయి తనిఖీలు చేపట్టకపోవడం కూడా పవర్‌లూమ్స్ పెరగడానికి కారణమవుతోంది.



రేషం

పవర్‌లూమ్స్‌తోనే ఇబ్బందులు



పవర్‌లూమ్స్ రాక వల్ల ధర్మవరంలోని చేనేత కార్మికుల తలరాతలు తలకిందులయ్యాయి. ఒకప్పుడు చేతినిండా పని దొరికేది. ముడిసరుకుల ధరలు నిలకడగా ఉండేవి. ప్రస్తుత ప్రభుత్వంలో 200 యూనిట్లు ఉచిత విద్యుత్ తప్పా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. దీనికితోడు పవర్‌లూమ్స్ మగ్గాలు అధికమయ్యాయి. దీంతో చేనేత పరిశ్రమ కుదేలైంది. చేనేత పరిశ్రమను ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపైనే ఉంది.

- వెంకటనారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి

పకోడి కొట్టు పెట్టుకున్నా



నేను ఐదేళ్ల కిందటి వరకు రెండు మగ్గాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగించేవాన్ని. ధరలు పెరగడం, చీరలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో కుటుంబపోషణ భారమైంది. ఈ వృత్తిపై బతకడం కష్టతరంగా మారింది. అందుకే దాన్ని వదిలేసి పకోడి కొట్టు పెట్టుకుని ప్రశాంతంగా జీవిస్తున్నా.

- ముత్తుజ, కేశవనగర్

మీరే పార్టీ బలం



మినీమహానాడులో ఐక్యత చాటుతున్న నాయకులు

(ఐదో పేజీ తరువాయి)

చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోరుగా సాగుతున్నాయన్నారు. చంద్రబాబు ముందుచూపుతోనే ఉమ్మడి జిల్లాకు హంద్రీ నీవా, కియ కార్ల పరిశ్రమ వచ్చినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం టీడీపీ నాయకులు, కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసుల మాఫీపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

◆ జెండా మోసిన కార్యకర్తను మరవొద్దు: బీకే పార్థసారథి, ఎంపీ



పార్టీ అధికారంలోకి వచ్చేందుకు జెండా మోసి, బెదింపులు, కేసులకు బెదరకుండా నిలబడిన నాయకులు, కార్యకర్తలను మరవొద్దు. ఈరోజు మనం ఇక్కడ కూర్చున్నామంటే కార్యకర్త వల్లే. అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలను విస్మరించకూడదు. ఎన్టీఆర్ అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాధికారం ఇచ్చారు. టీడీపీకి ఓ చరిత్ర ఉంది. పార్టీ కోసం ఎవరెవరు కష్టపడి పనిచేశారో వారికి సముచిత గౌరవం ఇవ్వాలి. ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు జిల్లాను అగ్రపథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు.

◆ కార్యకర్తలకు అండగా ఉండాలి: పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే



మనం అధికారంలోకి వచ్చి ఏడాదైంది. ఇంకా కొంత మంది పోలీసులు వైసీపీ ముసుగు వేసుకుని పని చేస్తున్నారు. నేటికి టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి. జెండా మోసిన టీడీపీ కార్యకర్తలకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పార్టీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. బడుగు, బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తెచ్చిన పార్టీ టీడీపీ. ఎంతో మందికి రాజకీయ భిక్షపెట్టింది టీడీపీయే. గత ఐదేళ్లుగా ధర్మవరంలో పార్టీ కోసం పరిటాల శ్రీరామ్ ఎంతో కష్టపడి పనిచేస్తున్నారు. ఎంత కష్టం వచ్చిన పార్టీ కార్యకర్తల వెన్నంటే ఉంటాం.

◆ కార్యకర్తల వెన్నంటి ఉంటాం: పల్లె సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే



ప్రజలే దేవుళ్లు సమాజమే దేవాలయం అన్న నినాదంతో దివంగత ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం. పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలను కాపాడుకుంటాం. చంద్రబాబు నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు దీటుగా ముందుకు వెళుతోంది. వైసీపీ పాలనలో టీడీపీ నేతలు, కార్యక్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయించేందుకు కృషి చేస్తాం. కార్యకర్తల వెన్నంటి ఉంటాం.

◆ ఏ పార్టీకి లేనంత కార్యకర్తల బలం: కందికుంట వెంకటప్రసాద్, కదిరి ఎమ్మెల్యే



ప్రపంచ చరిత్రలో ఏరాజకీయ పార్టీకి లేనంత కార్యకర్తల బలమున్నా పార్టీ టీడీపీనే. కొన్ని కుటుంబాలు, వర్గాలకు మాత్రమే పరిమితమైన రాజ్యాధికాధికారాన్ని బడుగు, బలహీన వర్గాలకు అందించిన ఘనత దివంగత ఎన్టీఆర్‌కే దక్కుతుంది. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీ నిలబడగలిగింది అంటే కార్యకర్తల వల్లే. పొద్దు తిరుగుడు పువ్వుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. జెండా మోసిన కార్యకర్తలను గౌరవంతో కాపాడుకోవాలి. ఏమాత్రం రాజకీయ నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చిన నన్ను సంక్షోభాల్లో కూడా కాపాడింది టీడీపీ కార్యకర్తలే.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

తీర్మానాలు

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడంపై జి ల్లా స్థాయి మినీమహానాడు అభినందన తీర్మానం పెట్టారు. సాగు, తాగునీరు, హంద్రీనీవా జ లాలు, జిల్లా పారిశ్రామిక అభివృద్ధి, రహదారులు, మౌలిక సదుపాయాలు, యువతకు ఉద్యో గం, ఉపాధి కల్పన, కార్యకర్తల సంక్షేమం, నూతన ఎన్టీయార్ కాలనీల ఏర్పాటు, టిడ్కో ఇళ్ల పూ ర్తి, అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామిక అభివృద్ధి, సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీల పని దినాలు 100 రోజుల నుండి 150 రోజులకు పెంపు, జగనన్న కాలనీల పేర్లు మార్పు, గుడిపల్లి రిజర్వాయర్ అభివృద్ధి, పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులు నీరు నింపే పేరూరు ప్రాజెక్టు త్వరగా చేయడం, బీసీలకు మహాత్మాజ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ స్కూల్ అదనంగా ఇవ్వాలి, ప్రతి నియోజకవర్గంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు, జిల్లాకేంద్రంలో అధికారుల కార్యాలయాలు కొరకు స్థల సేకరణ, భవనాల నిర్మాణం, టీడీపీ కార్యాలయం నిర్మాణం కొరకు స్థలం, పుట్టపర్తి కొత్తచెరువు, బుక్కపట్నం మూడు మండలాలను కలిపేలా రింగ్‌రోడ్ నిర్మాణం, బుక్కపట్నం చెరువులో ముంపుభూములకు పరిహారం చెల్లించాలి, హంద్రీనీవా కాలువ భూముల పరిహారం 9వ ప్యాకేజీ పెద్దకమ్మవారిపల్లి భూములకు పరిహారం చెల్లించాలి, రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసుల ఎత్తివేయడం, అమరజవాన్ మురళీనాయక్ పేరును కళ్ళితండాకు పెట్టడం, బీసీ, ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు విరివిగా సబ్సిడీ రుణాలు మంజూరు చేసేలా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానం చేశారు.

◆ తెలుగు నేల ఉన్నంత కాలం: ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే మడకశిర



తెలుగు నేల, జాతి ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ తెలుగు ప్రజల గుండెల్లో ఉంటుంది. కార్యకర్తల అండతోనే పార్టీ నాలుగు దశాబ్దాల పైబడిన ప్రస్థానాన్ని కొనసాగించింది. అన్ని వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఘనత టీడీపీదే. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఫొటో చూసి భయపడుతున్నారని కొంత మంది జఫ్ఫాగాళ్లు వైసీపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పులివెందుల గడ్డపై సైకోపోవాలి.. సైకిల్ రావాలంటూ నినదించిన దమ్మున్న కార్యకర్తలు గల పార్టీ టీడీపీ. కష్టకాలంలో పసుపు జెండా మోస్తూ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటాం.

◆ గుండెల్లో పెట్టుకుంటాం: కొల్లకుంట అంజినప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



గత ఐదేళ్లు దుర్మార్గ పాలనపై పోరాటం చేసి, పార్టీని అధికారంలోకి తెచ్చిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటాం. ఈరోజు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలతోపాటు పార్లమెంట్‌లో క్లీన్ స్వీప్ చేశామంటే కార్యకర్తల కృషి వల్లే. ఐదు లక్షల పసుపు సైనికుల వల్లే జిల్లా, గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ వల్లే జిల్లా పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో దూసుకెళ్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేలా సన్నద్ధమవుదాం.

◆ కార్యకర్తల త్యాగ ఫలితమే అధికారం: పల్లె రఘునాథరెడ్డి. మాజీ మంత్రి



కార్యకర్తల త్యాగ ఫలితంగానే కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. యువగళం పాదయాత్రతో యువకుల్లో ఆత్మస్థైర్యం నింపి, వైపీసీ నాయకుల గుండెల్లో భయం నింపిన నాయకుడు లోకేశ్. కోటిమందికి పైగా పార్టీ సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ. మరో 30 సంవత్సరాలు తెలుగుదేశంపార్టీ అధికారంలో ఉండాలి. ఎమ్మెల్యే సింధూరారెడ్డి చొరవతో సత్యసాయి శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు. నియోజకవర్గంలో 193 చెరువులను నింపి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం.

◆ కట్టె కాలేవరకు.. పరిటాల శ్రీరామ్



కట్టెకాలే వరకు పచ్చకండువా నామెడలోనే ఉంటుంది. పరిటాల రవిని ఆరోజు ఎన్టీఆర్ ఏవిధంగా పచ్చ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించాలో అలాగే నాకు నందమూరి బాలకృష్ణ మొట్టమొదటిసారిగా కండువా వేసి ఆహ్వానించారు. బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు వచ్చిన నేపథ్యంలో అభినందలు తెలుపుతూ పెట్టిన తీర్మానం బలపరిచే అవకాశం నాకు దక్కడం చాలా సంతోషంగా ఉంది.

◆ నిబద్ధతతో పని చేద్దాం: గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ



పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి తెచ్చిన ఘనత దివంగత ఎన్టీఆర్‌కే దక్కుతుంది. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఆయన శ్రమించారు. ప్రజలే దేవుళ్ల సమాజమే దేవాలయం అన్న నినాదంతో ఆవిర్భవించిన పార్టీలో మనమందరం నిబద్ధతతో రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేద్దాం.

◆ కార్యకర్తలే కొండంత అండ: నిమ్మల కిష్టప్ప, మాజీ ఎంపీ



తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కొండంత అండ. వైసీపీ దుర్మార్గ పాలన అంతమొందించడంలో కార్యకర్తల పోరాటం అద్భుతం. రాష్ట్ర శాసనసభలో వైసీపీ నాయకుల నీచమైన మాటలకు ఆవేదన చెంది ముఖ్యమంత్రిగానే శాసనసభలో అడుగుపెడతానని చంద్రబాబు చేసిన శపథాన్ని నెరవేరడానికి కార్యకర్తలు చేసిన పోరాటమే కారణమం.

◆ పల్లె భావోద్వేగం



మినీ మహానాడులో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. మినీ మహానాడు వేదికపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రసంగిస్తూ తమది చిన్నకుటుంబం అయితే తన మామయ్య పల్లె రఘునాథరెడ్డి మంచితనంతో ఇంత మంది కార్యకర్తలు గల నియోజకవర్గాన్ని కుటుంబంగా తనకు ఇచ్చారన్నారు. ఆయన 30 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవను గుర్తించే పుట్టపర్తి ఎమ్మెల్యేగా తనను గెలిపించారని, ఈ సందర్భంగా పల్లె రఘునాథరెడ్డికి శిరస్సు వంచి వందనాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో వేదికపై ఉన్న పల్లె రఘునాథరెడ్డి భావోద్వేగానికి గురై కంట తడిపెట్టారు. వేదిక ఉన్న నాయకులు, సభకు వచ్చిన పార్టీ శ్రేణులు కాసేపు పల్లెను చూచి భావోద్వేగానికి గురయ్యారు.

వేధించిన సీఐకి ప్రాధాన్యమా..?

మంత్రి పయ్యావులను పరోక్షంగా ప్రశ్నించిన టీడీపీ నాయకుడు

పుట్టపర్తి రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులు పెట్టిన సీఐకి ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని మంత్రి పయ్యావుల కేశవ్‌ను టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు ప్రశ్నించారు. పుట్టపర్తిలో శనివారం జరిగిన పార్టీ జిల్లా మినీ మహానాడులో ఆయన ప్రసంగించారు. అనంతపురం జిల్లా మినీ మహానాడులో 'పొద్దుతిరుగుడు పూల తరహాలో వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలోకి వస్తున్నారు. వారికి ప్రాధాన్యం ఇచ్చేది లేదు' అని మంత్రి అన్నారని గుర్తు చేశారు. కానీ వైసీపీ హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను, నాయకులను నానా ఇబ్బందులకు గురిచేసిన ఓ సీఐకి ఉరవకొండ నియోజకవర్గంలోనే మంత్రి



మినీ మహానాడులో మాట్లాడుతున్న దండు ఓబులేసు

పోస్టింగ్ ఇప్పించారని, ఇదేమి న్యాయం సార్ అని ఓబులేసు ప్రశ్నించారు. ఆ సీఐ రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ నాయకులతో పాటు అప్పటి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథిని కూడా బెదిరించి, బూతులు తిట్టిన విషయాన్ని మీరు మరిచిపోయారా? అని ప్రశ్నించారు. మంత్రి ఇలా వ్యవహరించడం తగదని ఓబులేసు అన్నారు.

రైతన్నకు విపత్తు..?

- సబ్సిడీ విత్తన వేరుశనగ నాణ్యతపై సందేహాలు
- ఎక్కడి నుంచి సేకరించారన్న సమాచారం నిల్
- ఇష్టారాజ్యంగా కొన్ని ఏజెన్సీల సేకరణ
- ఈ ఏడాది ఆలస్యంగా ప్రాసెసింగ్ మొదలు
- అదునుకు విత్తనం అందేనా..?



ప్రాసెసింగ్ చేసిన విత్తన వేరుశనగ కాయలు

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేసే సబ్సిడీ విత్తన వేరుశనగ నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి విత్తన ప్రాసెసింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. గతంలో మే నెలారంభం నుంచే విత్తన ప్రాసెసింగ్‌ను మొదలు పెట్టేవారు. ఈ సారి గత రెండు రోజుల కిందటి నుంచి విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పనులు ఆరంభించారు. ఖరీఫ్ సీజన్ ఆరంభానికి మరో వారం రోజులే సమయం ఉంది. ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో దుక్కులు పూర్తి చేసుకున్నారు. మరో సారి వర్షం పడితే సీజన్ ఆరంభంలోనే విత్తనం వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈనెలాఖరులోగా మండలాలకు విత్తన కాయలు సరఫరా చేయాలని వ్యవసాయ ఉన్నతాధికారులు ఆదేశించారు. సమయం తక్కువగా ఉండటంతో విత్తన ప్రాసెసింగ్ ఆశించిన స్థాయిలో జరిగే పరిస్థితులు లేవనే వాదనలు వినిపిస్తున్నాయి. దీని ప్రభావం విత్తన నాణ్యతపై పడే అవకాశం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కొన్ని ఏజెన్సీలు నాసిరకం విత్తన కాయలు సేకరించారన్న విమర్శలున్నాయి. సబ్సిడీ విత్తన సేకరణ విధానంలో మార్పులు చేయడంతోనే ఈ సమస్య తలెత్తిందన్న వాదనలున్నాయి.

గతంలో సర్టిఫైడ్ సీడ్ సరఫరా

గతంలో సరిఫైడ్ సీడ్‌ను సరఫరా చేసేవారు. ఈ పద్ధతిలో విత్తన వేరుశనగ సరఫరా సమయంలో విత్తన సేకరణ సంస్థలు సేకరించిన విత్తనం నాణ్యంగా ఉందా.? లేదా అన్న విషయాన్ని విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులు పరిశీలించి, ట్యాగ్ వేసేవారు. ఏఏ రైతుల నుంచి వేరుశనగ సేకరించారన్న జాబితాను విత్తన సేకరణ సంస్థలు విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులకు అందించేవారు. అప్పట్లో మూల విత్తనాన్ని రైతులకు అందించి బోరుబావుల కింద పంట పండించేవారు. ఆయా రైతులు పండించిన వేరుశనగ పంటను తిరిగి కొనుగోలు చేసేవారు. మూల విత్తనంతో సాగు చేసిన పంటను పలు దశల్లో విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులు పర్యవేక్షించేవారు. పంట కాలంలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారా..? కాయ నాణ్యత వచ్చేందుకు పాటించాల్సిన పద్ధతులపై పంట కాలంలో దశల వారిగా పర్యవేక్షించేవారు. అన్ని సవ్యంగా ఉంటేనే ఆయా రైతుల నుంచి విత్తన వేరుశనగను సేకరించేవారు.

సొంత ధ్రువీకరణ పద్ధతితో గందరగోళం

సొంత ధ్రువీకరణ (టీఎల్) పద్ధతిలో విత్తన వేరుశనగ సేకరణ గందరగోళంగా మారింది. ఈ విధానంలో ఏజెన్సీలకే విత్తన సేకరణపై స్వేచ్ఛను ఇచ్చారు. కొన్ని సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా విత్తనం సేకరించినట్లు తెలిసింది. రబీ సీజన్‌లో బోరుబావుల కింద పండించిన పంటలో నాణ్యమైన విత్తన కాయలను సేకరించాల్సి ఉంది. కొన్ని సంస్థలు అందుకు విరుద్ధంగా వ్యాపారుల నుంచి, మరికొందరు ఖరీఫ్‌లో వర్షాధారం కింద పండించిన పంటను సేకరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఆ విత్తనాన్ని ప్రాసెసింగ్ చేసి బస్తాల్లో నింపుతున్న ట్లు సమాచారం. ఇవి చూసేందుకు బాగానే ఉన్నా, మొలకశాతం తక్కువగా రావడం, నాణ్యత, మంచి దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతి ఏడాది ఇదే తంతు కొనసాగుతోంది. గత ఐదేళ్లల్లో నాసిరకం విత్తన నాయలను పలు మండలాల్లో ఏఓలు తిరస్కరించి వెనక్కి పంపారు. మరికొన్ని మండలాల్లో ప్రలోభాలకు తలొగ్గి మిన్నకుండిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ సారి పలు ప్రాంతాల్లో అదే పరిస్థితులు కొనసాగించేందుకు సిద్ధమయ్యారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

సమీపిస్తున్న ఖరీఫ్.. ఆందోళనలో అన్నదాతలు

ఈ ఏడాది అనంత జిల్లాకు 50592 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 63వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. అయితే ఇప్పటి దాకా మండలాలకు విత్తన కాయలు చేరకపోవడంతో ఎప్పటి నుంచి విత్తన పంపిణీ ప్రారంభిస్తారంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఏప్రిల్ ఆఖరు వారంలోనే విత్తన సరఫరా, ధరలు ఖరారు చేయడంతో మే 1 నుంచి విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పనులు మొదలు పెట్టారు. మే 18 నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. మే మూడో వారం నుంచే విత్తన వేరుశనగ పంపిణీ మొదలు పెట్టారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 15 విత్తన సేకరణ ఏజెన్సీలకు (అనంత జిల్లాలో 12 ఏజెన్సీలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 3 ఏజెన్సీలు) విత్తన వేరుశనగ సరఫరా బాధ్యతలు అప్పగించారు.

గత ఏడాది విత్తన సరఫరాకు సంబంధించిన బకాయిలు ఉండటంతో ఇప్పటి వరకు ప్రాసెసింగ్ మొదలు పెట్టలేదు. తాజాగా కొంత బకాయిలు చెల్లించడంతో రెండు రోజుల నుంచి విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పనులు మొదలుపెట్టారు. ఉమ్మడి జిల్లాకు 1.13 లక్షల క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా చేయాల్సి ఉంది. విత్తన పంపిణీ మొదలు పెట్టాలంటే ఆయా రైతు సేవా కేంద్రాలకు కేటాయించిన మొత్తంలో సగం కాయలు సరఫరా చేయాల్సి ఉంటుంది. గత రెండు రోజులుగా 3వేల క్వింటాళ్ల విత్తనాన్ని ప్రాసెసింగ్ చేశారు. ఈ లెక్కన ఎప్పటిలోగా క్షేత్ర స్థాయికి పూర్తి స్థాయిలో విత్తన కాయలు పంపుతారోనన్న సందిగ్ధత నెలకొంది.



బెళుగుప్ప ఏజెన్సీలో విత్తన వేరుశనగను ప్రాసెసింగ్ చేస్తున్న దృశ్యం

నాణ్యమైన విత్తన కాయల సరఫరాకు చర్యలు



ఏజెన్సీలు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను సరఫరా చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అందుకోసమే ఒక్కో ప్రాసెసింగ్ యూనిట్‌కు ఒక ఏఓను పర్యవేక్షణాధికారిగా నియమించాం. ముందస్తు ప్రణాళికల మేరకు నిర్దేశించిన మోతాదులో రైతు సేవా కేంద్రాలకు విత్తన కాయలు సరఫరా చేస్తాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే విత్తన పంపిణీ తేదీని ప్రకటిస్తాం.

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

ఎడ తెగని బదిలీ సమస్యలు...!

- క్యూ కడుతున్న టీచర్లు, సంఘాల నేతలు
- సీనియారిటీ జాబితాపై స్పష్టత ఇవ్వని అధికారులు
- డీఈఓల మధ్య కొరవడిన సమన్వయం
- శ్రీసత్యసాయి అధికారుల పాత్ర నామమాత్రం

అనంతపురం విద్య, మే 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో సమస్యలు తెగడం లేదు. సీనియారిటీ, స్కూలులో పోస్టులు పోవడం, బదిలీలకు దరఖాస్తు చేసేటప్పుడు ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులు.. ఇలా సమస్యలు కోకొల్లలు. ఫలితంగా ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు కార్యాలయానికి పోటెత్తుతున్నారు. ఎడతెగని బదిలీల సమస్యలతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారుల మధ్య సమన్వయం లేకపోవడం.. ముఖ్యంగా సత్యసాయి జిల్లా అధికారులు నామమాత్రపు పాత్ర పోషిస్తుండటంతో బదిలీలు, పదోన్నతుల్లో ఎదురయ్యే సమస్యలతో టీచర్ల గగ్గోలు పెడుతున్నారు.

కొరవడిన సమన్వయం

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు రెండు జిల్లాలకు అనంతపురం జిల్లా వేదికగా నిర్వహిస్తున్నారు. సుమారు 15వేల మంది టీచర్లు ఉన్నారు. బదిలీలు, ప్రమోషన్ల సన్నద్ధత ప్రక్రియ ఈనెల మొదటి వారంలోనే మొదలైంది. అనంతపురం, సత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారులు, ఏడీలు, సూపరింటెండెంట్లు, రెండు జిల్లాల ఐటీ సెల్ సభ్యులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పూర్తి చేయాల్సి ఉంది. అనంతపురం జిల్లా ఐటీ సెల్, ఇతర సిబ్బంది ని త్యం అందుబాటులో ఉంటున్నారు. అనం త జిల్లా డీఈఓ, సిబ్బంది భాగస్వామ్యం ఉన్నట్టుగా సత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారుల పాత్ర కనిపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ జిల్లా డీఈఓ, ఏడీలు, సిబ్బంది చుట్టపుచూపుగా ప్రత్యక్షమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. సత్యసాయి జిల్లా ఐటీ సెల్ సిబ్బంది, ముగ్గురు లేదా నలుగురు క్లర్కులు మినహా ఇతరుల పాత్ర కనిపించలేదని ఉపాధ్యాయులు, సంఘాల నేత ల నుంచి వినిపిస్తోంది. అదేవిధంగా బదిలీ లు, ప్రమోషన్ల కోసం వేసిన టీమ్స్‌లో ఉన్న టీచర్లు సైతం చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారు. మరికొందరు అక్కడ కనిపించడం లేదు.

సమస్యలకు బదులిచ్చేవారేరీ...?

బదిలీలు, ప్రమోషన్ల వేళ టీచర్లు సమస్యలతో కొట్టుమిట్టాడుతూనే ఉన్నారు. అధికారుల సమన్వయం చేసుకోకపోవడంతో ఉపాధ్యాయులు, సంఘాల నేతల ఇచ్చే వినతులు, గ్రీవెన్సులు ఎక్కడివక్కడే మూలుగుతున్నాయి. బదిలీల వేళ సాంకేతిక సమస్యలు కూడా టీచర్లను వెంటాడుతున్నాయి. వాటిపై స్పష్టత ఇచ్చేవారు లేరు. ఎస్‌జీటీగా పనిచేస్తూ...తర్వాత డీఎస్సీల్లో స్కూల్ అసిస్టెంట్‌గా నియమితుయిన టీచర్లకు.. ఎస్‌జీటీ పాయింట్లు కాకుండా ఎస్ఏ పాయింట్లు పరిగణనలోకి తీసుకుంటున్నారని వాపోతున్నారు. 40 సంవత్సరాలు పైబడిన అవివాహిత టీచర్లకు 5 పాయింట్లు జత కావడం లేదని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. 2023లో బదిలీ అయి.. ఈ ఏడాది రేషనలైజేషన్‌లో పోస్టు పోయే టీచర్లకు.. 2023లో పొందిన స్టేషన్ పాయింట్లు, ప్రస్తుత రేషనలైజేషన్ స్టేషన్ పాయింట్లు కూడా జత చేస్తున్నారని, 9,10 ఏళ్ల పనిచేసిన వాళ్లకు సీలింగ్ పేరుతో స్టేషన్ పాయింట్లు తొలగిస్తుండటంపై కొందరు టీచర్లు భగ్గుమంటున్నారు. లాంగ్వేజ్ పండిట్స్ తెలుగు, హిందీ, పీఈటీలు 2019లో ఎస్ఏగా ప్రమోషన్ పొంది....రెండుసార్లు రేషనలైజేషన్ ప్రభావానికి గురయిన టీచర్లకు 7 పాయింట్లు కాకుండా 5 పాయింట్లు వస్తున్నాయని వాపోతున్నారు. జిల్లాలో 46 మంది వరకూ పీఈటీలు ఉన్నామని, బదిలీకి దరఖాస్తు చేసుకోవాలా వద్దా.. చెప్పేవారు లేరని వారు వాపోతున్నారు. ఇలా అనేక సందేహాలకు, సమస్యలకు బదులిచ్చేవారు లేరు. ఉమ్మడి జిల్లాల విద్యాశాఖాధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్యలు, సందేహాలు పరిష్కారం కాలేదంటూ టీచర్లు, సంఘాల నేతలు గగ్గోలు పెడుతున్నారు.



వినతులు స్వీకరిస్తున్న విద్యాశాఖాధికారులు

క్రైం కార్నర్

ఎన్‌ఎస్‌యూఐ నాయకుడి హత్యకేసు.. మరొకరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్, సీఐలు

హిందూపురం, మే 24(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు, న్యాయవాది అయిన సంపత్‌కుమార్ హత్యకేసులో నిందితుడైన కేసీ నాగార్జునరెడ్డిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. వివరాలను శనివారం హిందూపురంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హిందూపురంలో నివాసమున్న న్యాయవాది కేసీ కృష్ణారెడ్డికి ఇంటివద్ద స్థలం విషయంలో మేళాపురానికి చెందిన శ్రీకాంత్‌తో గొడవలు జరిగాయి. ఆబాద్‌పేటలో నివాసమున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు, న్యాయవాది అయిన సంపత్‌కుమార్ తన స్నేహితుడైన శ్రీకాంత్‌కు అండగా నిలిచాడు. ఈక్రమంలో కేసీ కృష్ణారెడ్డి, సంపత్‌కుమార్‌లు ఒకరిపై ఒకరు కేసులు కూడా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సంపత్‌కుమార్ అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నారు. దీంతో గత ఏడాది మే 29న రాత్రి మంచి మాటలతో కొటిపి సమీపంలోని చింతలపల్లికి వెళ్లే దారిలో పక్కకు సంపత్‌కుమార్‌ను తీసుకెళ్లారు. అక్కడ అతడికి మద్యం తాపించి కొడవలి, బాకుతో దాడిచేశారు. పగిలిన బీరుబాటిల్ సీసాలతో పొడిచి హత్యచేశారు. ఆ తరువాత మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి ధర్మవరం సమీపంలోని చెరువు మరువ వద్ద పడేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఐదుగురిని అరెస్టుచేయగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. ఇందులో ఏ-2గా ఉన్న కేసీ నాగార్జునరెడ్డిని శనివారం తెల్లవారుజాము సమయంలో కర్ణాటకలోని దేవనహళ్లి వద్ద ఓ రిసార్ట్‌లో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఏ-1గా ఉన్న న్యాయవాది కేసీ కృష్ణారెడ్డితోపాటు మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అప్‌గ్రేడ్ సీఐ రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, అబ్దుల్‌కరీం, ఎస్ఐలు మునిప్రతాప్, మునీర్ అహ్మద్, నరేంద్రలను ప్రత్యేక బృందాన్ని డీఎస్పీ అభినందించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



ధర్మవరం, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గమ్మగుడి పెట్రోల్ బంక్ ఎదురుగా బస్టాప్‌లో ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు 94948 16259 నెంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

వీఆర్‌ఓకు లంచం

- పని చేయలేదని డిప్యూటీ తహసీల్దారుకు రైతు ఫిర్యాదు

కూడేరు, మే 24, (ఆంధ్రజ్యోతి): భూ సమస్య పరిష్కారం కోసం వీఆర్‌ఓ బండారు శంకరనారాయణకు రూ. లక్ష లంచం ఇచ్చినట్లు మండలంలోని కల్లగళ్ల గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి డిప్యూటీ తహసీల్దారుకు శనివారం ఫిర్యాదు చేశాడు. తాను సాగు చేస్తున్న భూమికి సాగు అనుమతులు ఇస్తానని చెప్పడంతో లంచం ఇచ్చినట్లు వాపోయాడు. గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్న భూమి పెండింగ్‌లో ఉండటంతో లంచం ఇస్తే సాగు అనుమతులు ఇప్పిస్తానని వీఆర్‌ఓ చెప్పడంతో నగదు ఇచ్చినట్లు పేర్కొన్నాడు. లంచం తీసుకొని కూడా భూమి సమస్య పరిష్కరించలేదని రైతు వీఆర్‌ఓతో వాగ్వాదానికి దిగాడు. తనకు న్యాయం చేసి సంబంధిత వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దారు సూర్యప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు.

- ఈ ఆరోపణలపై వీఆర్‌ఓను వివరణ అడగ్గా తాను రైతుతో డబ్బు అప్పుగా తీసుకున్నట్లు తెలిపారు. వివిధ సందర్భాల్లో రూ.40 వేలు అప్పుగా తీసుకున్నట్లు పేర్కొన్నారు.

రాజస్థాని వ్యాపారిపై స్థానిక వ్యాపారుల దాడి

కళ్యాణదుర్గం, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంబదూరు బైపాస్‌లో ఇనుప కడ్డీల దుకాణం ఏర్పాటు చేసుకున్న రాజస్థాని వ్యాపారి జితేందర్‌పై స్థానిక వ్యాపారులు దాడి చేశారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన మేరకు.. రాజస్థాన్‌కు చెందిన జితేందర్ 2020లో ఇనుప కడ్డీల వ్యాపారం ప్రారంభించారు. కొంత తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేక పట్టణానికి చెందిన ఇనుప కడ్డీల వ్యాపారులు రేవన్న, అతడి కుమారుడు దివాకర్, మరికొందరు మొదటి నుంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పది రోజుల కిందట దుకాణం వద్దకు వచ్చి దాడి చేశారని బాధితుడు వాపోయారు. పలువురు వ్యాపారులతో కలిసి మరోసారి శుక్రవారం దుకాణం వద్దకు వచ్చారన్నారు. సీసీ కెమెరాలు ఆఫ్ చేసి గొడవ పడ్డారని, ఖాళీ చేసి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరించారని తెలిపారు. అక్కడే ఉన్న రంగుల డబ్బాలు, చేతికి దొరికిన వాటితో దాడి చేయగా పరుగులు తీసినట్లు వాపోయారు. ఒక కిలోమీటర్ వరకు ద్విచక్రవాహనంపై వెంటాడి విచక్షణా రహితంగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమపై కూడా దాడి చేశారంటూ రేవన్న, దివాకర్ ఆసుపత్రిలో చేరారు. ఈ విషయమై టౌన్ సీఐ యువరాజును వివరణ కోరగా.. రాజస్థాన్ వ్యాపారి జితేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మృతదేహంతో నిరసన

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి
- 9 రోజులైనా కారకులను పట్టుకోలేదని ఆగ్రహం
- పోలీసుస్టేషన్ వద్ద మృతుడి బంధువుల ఆందోళన

హిందూపురం, మే 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడి మృతి చెందినా.. నిందితులను అరెస్ట్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసుల తీరుపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన వీరన్న(25) అనే యువకుడి బంధువులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌వద్ద శనివారం నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 16న రాత్రి కగ్గల్లుకు చెందిన వీరన్న పట్టణంలో గుంటూరు సెల్ఫుల పని ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. కొట్నూరు సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. బెంగళూరులో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. వారు మృతదేహాన్ని అంబులెన్స్‌లో నేరుగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి స్టేషన్ గేటువద్ద మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన రోజే పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఇప్పటి వరకు ప్రమాదానికి కారణమైన వాహనాన్నికానీ, కారకులనుకానీ అరెస్ట్ చేయలేదని మండిపడ్డారు. ప్రమాదానికి కారణమైన వాహన యజమానిని పోలీసులు పిలిపించుకుని మాట్లాడి పంపించేశారని ఆరోపించారు. సీఐ రాజగోపాల్‌నాయుడు, ఎస్ఐ శ్రీధర్ వారివద్దకు వెళ్లి సర్దిచెప్పారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, అందుకు కారకులైన వారిని పట్టుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని కగ్గల్లుకు తీసుకెళ్తూ కొట్నూరు పెట్రోల్‌బంక్ వద్ద మరోసారి రోడ్డుపై నిరసన చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అక్కడికి వెళ్లి పంపించేశారు.


మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న బంధువులు

మరణమే శరణమా..?

ఉమ్మడి జిల్లాలో ఆరుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో ఒకరు నాలుగు రోజుల క్రితమే ఉరి వేసుకోగా.. శనివారం వెలుగులోకి వచ్చింది. మిగిలిన ఐదుగురు ఒకే రోజు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతో ఓ రైతు, అనారోగ్యంతో మరో రైతు, సెల్‌ఫోన్ కోసం విద్యార్థి, ఒంటరి జీవితం వద్దనుకుని ఓ మహిళ, ఓ పురుషుడు, ఇంట్లోవారితో గొడవపడి యువకుడు.. ఇలా ఎవరికివారు జీవితాన్ని వద్దనుకున్నారు. లోకాన్నివీడి శాశ్వతంగా వెళ్లిపోయారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

- ఉమ్మడి జిల్లాలో ఆరుగురి ఆత్మహత్య
- అప్పుల బాధతో అన్నదాత
- సెల్‌ఫోన్ కొనివ్వలేదని విద్యార్థి..
- ఒంటరి జీవితం వద్దనుకుని ఇద్దరు..
- అనారోగ్యంతో ఒకరు..
- ఇంట్లోవారితో గొడవపడి మరొకరు..

అప్పుల బాధతో రైతు..


కురుబ మంజు (ఫైల్)

బెళుగుప్పకు చెందిన రైతు కురుబ మంజు(44) అప్పుల బాధతో ఉరివేసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంజు ఈ నెల 21న ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో వారి ఇం టి సమీపంలోని ఖాళీ ఇంటి నుంచి శనివారం దుర్వాసన రావడంతో వెళ్లి చూశారు. ఆ ఇంటి స్నానపు గదిలో మంజు ఉరి వేసుకున్నట్లు గు ర్తించారు. మంజుకు ఏడు ఎకరాల పొలం ఉంది. దీనికితోడు తన సోదరులు, ఇతరుల భూములను కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేసేవాడు. రెండు మూడేళ్ల నుంచి సరైన దిగుబడి రాక నష్టపోయాడు. అ ప్పులు, వడ్డీలు రూ.30 లక్షలకు చేరాయి. రుణదాతల నుంచి ఒత్తిళ్లు పె రిగాయి. దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడు. రైతుకు భార్య పద్మావ తి, ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద ది క్కును కోల్పోయి భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్ర భుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరింది. కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని బెళుగుప్ప ఎస్ఐ శివ తెలిపారు.

సెల్‌ఫోన్ కోసం విద్యార్థి..


శ్రీనివాసులు(ఫైల్)

తల్లిదండ్రులు సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఇంటర్ విద్యార్థి వడ్డె శ్రీనివాసులు(18) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గుంతకల్లు పట్టణంలోని కొనకొండ్ల రైల్వే గేట్ సమీపంలో నాగభూషణం, మమత దంపతుల కుటుంబం నివసిస్తోంది. వీరి కుమారుడు శ్రీనివాసులు పదో తరగతి పాసై.. రెండు రోజుల క్రితం స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాడు. తన స్నేహితుడి పాత సెల్‌ఫోన్‌ను తెచ్చుకుని వాడుకునేవాడు. ఆ ఫోన్‌ను తిరిగి ఇచ్చేయాలని, సిమ్ కార్డు తీసేయాలని శ్రీనివాసులుకు తండ్రి సూచించాడు. ఇతరుల ఫోన్ వాడటం మంచిది కాదని మందలించాడు. తాను కొత్త ఫోన్ కొనిస్తానని సూచించాడు. కానీ వెంటనే కొనివ్వనందుకు మనస్తాపం చెందిన శ్రీనివాసులు, బహిర్భూమికి వెళ్లి హనుమాన్ సర్కిల్ రైల్వే స్టేషన్ సమీపంలో తిరుపతి ప్యాసింజర్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఒంటరి జీవితం వద్దనుకుని...

- గుడిబండ మండలం జీఎన్ తండాకు చెందిన దేవరాజ్ నాయక్(45) చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఆయనకు పదేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగలేదు. ఈ బాధ చాలదన్నట్లు భార్య అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో దేవరాజ్ నాయక్ మద్యానికి బానిసయ్యాడు. ఒంటరి జీవితంపై విరక్తి చెందిన తమ పొలంలోని చింత చెట్టుకు శనివారం ఉరి వేసుకున్నాడు. దేవరాజ్ తండ్రి అర్జా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు.


చింత చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న దేవరాజ్‌నాయక్

- రాయదుర్గం పట్టణంలోని మూడో వార్డుకు చెందిన భాగ్యలక్ష్మి(32) ఒంటరి జీవితంపై విరక్తి చెందిన బావిలో దూకింది. ఆమెకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. పైళ్లైన నాలుగు నెలలకే భర్త చనిపోయారు. ఆ వేదనతో ఆమె మానసిక అనారోగ్యానికి గురైంది. పలుమార్లు ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. అందరూ చూస్తుండగానే శనివారం మధ్యాహ్నం పట్టణంలోని పాలబావిలో దూకింది. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో..


నరసింహులు(ఫైల్)

పుట్టపర్తి మండలం బత్తలపల్లికి చెందిన నరసింహులు(52) అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడు. నరసింహులు వ్యవసాయం చేసుకుంటూ, గొర్రెలను మేపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కొన్నాళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్టుకు శనివారం ఉరివేసుకున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇంట్లోవారితో గొడవపడి..


మృతిచెందిన షాహిద్‌ఖాన్

పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామ సమీపంలో హరియాణాకు చెందిన షాహిద్‌ఖాన్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న షాహిద్ ఖాన్, గుత్తి అనంతపురం హైవేలో డాబా వద్ద నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి గొడవ పడ్డాడు. ఆ తరువాత చెరువుకట్ట వద్ద 220 కేవీ విద్యుత్ స్తంభానికి ఉరివేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

హెచ్చెల్సీ ఎస్ఈగా పురార్ధన్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, మే 24(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ ఎస్ఈగా పురార్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. నంద్యాల జిల్లా ఎస్ఆర్‌బీసీ సర్కిల్-1 ఎస్ఈగా ఉన్న పురార్ధన్‌రెడ్డికి హెచ్చెల్సీ ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు హెచ్చెల్సీ ఎస్ఈగా ఉన్న రాజశేఖర్ గత నెల 30న పదవీవిరమణ చేశారు. దీంతో ఇన్‌చార్జి ఎస్ఈగా పురార్ధన్‌రెడ్డి శనివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఇంజనీర్లు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ ఏడాది 18వేల హెక్టార్లు లక్ష్యం

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఈ ఏడాది 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు కోసం ప్రభుత్వం లక్ష్యం విధించినట్లు ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో డ్రిప్ మంజూరుకు చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఐదు ఎకరాలలోపు 90 శాతం సబ్సిడీ ఉండేదన్నారు. ఐదెకరాల నుంచి 10 ఎకరాలదాకా 70 శాతం సబ్సిడీ ఉండేదన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం 5 నుంచి 10 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీని వర్తింపజేశారన్నారు. చిన్న, సన్నకారు, పెద్దకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులకు స్ప్రింక్లర్లపై 50 శాతం సబ్సిడీ వర్తింపజేసినట్లు తెలిపారు. రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో నచ్చిన డ్రిప్, స్ప్రింక్లర్ల కంపెనీ పేరుపై దరఖాస్తు చేసుకోవాలన్నారు.

27న జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, మే 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఈనెల 27న జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కదానిష్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి పాస్/ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులని అన్నారు. కోర్టురోడ్డులోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

నిరుద్యోగులకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మే 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. జావా ఫుల్‌స్టాక్, పైథాన్, డాటా ఇంజనీరింగ్ కోర్సుల్లో ఆరు నెలల పాటు ఐటీ రంగంలో సుమారు 18 సంవత్సరాల అనుభవం ఉన్న శిక్షకులతో అత్యున్నత నాణ్యమైన శిక్షణ ఉంటుందన్నారు. ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. నగరాలలో ఈ కోర్సుకు అయ్యే ఖర్చులో 80 శాతం రాయితీతో, నామమాత్రపు ఫీజు రూ.5వేలు చెల్లించాలన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ ఐటీ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 7396950345, 8317594591ను సంప్రదించాలని తెలిపారు.

ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు

- ఏఎస్పీని కలిసిన జడ్పీ చైర్‌పర్సన్, వైసీపీ నాయకులు

అనంతపురంక్రైం, మే24(ఆంధ్రజ్యోతి): తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన టీడీపీ ముగ్గురు ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఏఎస్పీ రమణమూర్తిని కోరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎంపీ తలారి రంగయ్యతో కలిసి ఆమె శనివారం ఏఎస్పీని కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 21న జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో టీడీపీ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుబాటిప్రసాద్‌లు తన అనుమతి లేకుండా వ్యక్తిగత చాంబర్‌లోకి వెళ్లి అధికారులతో దురుసుగా ప్రవర్తించారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఎస్పీని కలిసిన వారిలో మేయర్ మహ్మద్ వసీం, వెన్నపూస రవీంద్రారెడ్డి, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ నాగరత్న తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పాము

- పట్టుకుని దూరంగా వదిలిన స్నేక్‌క్యాచర్


పామును పట్టుకున్న ముస్తఫా

హిందూపురం, మే 24(ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం వద్ద పాము కలకలం రేపింది. రెండ్రోజుల పాటు పాము దొరక్కుండా అక్కడే తచ్చాడుతుండటంతో ఆ ప్రాంతంలో నివాసం ఉన్నవారు ఒకింత ఆందోళన చెందారు. ఎమ్మెల్యే కార్యాలయం ముందు నుంచి పెద్దపాము వెళ్తున్నట్లు శుక్రవారం మధ్యాహ్నం కొందరు చూశారు. వెంటనే ఎమ్మెల్యే పీఏ బాలాజీకి చెప్పడంతో పాములు పట్టే ముస్తఫాను పిలిపించారు. అక్కడ చుట్టుపక్కల కార్లు పార్క్‌చేసిన చోట వెతికారు. అయినా దొరకలేదు. అయితే శనివారం ఉదయం మరోసారి ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలో బండ కిందకు వెళ్లింది. దీంతో పాములు పట్టే ముస్తఫాను పిలిపించారు. ఆయన బండ కింద ఉన్న పామును పట్టి, ఊరిబయట పొలాల్లోకి వదిలేశారు. అయితే పట్టుబడిన పాము 7.5అడుగుల పొడవు ఉందని ముస్తఫ తెలిపారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు


రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బ్రహ్మానందం

గుంతకల్లు, మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో భద్రత విషయంగా రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీరు (పీసీఈ) బ్రహ్మానందం తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 7వ నంబరు ప్లాట్‌ఫాంలో గోడ ప్లాస్టింగ్ పెచ్చులు ఊడిపడి మణికంఠ అనే బాలుడు మృతిచెందిన విషయం విదితమే. ఈ సంఘటనపై రైల్వే ప్రిన్సిపల్ ఇంజనీర్ శనివారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ప్రమాద సంఘటనా ప్రదేశాన్ని, రైల్వే స్టేషన్‌లో భవన సముదాయాలను తనిఖీ చేశారు. డెబ్బైయ్యేళ్ల పురాతన భవనాన్ని పీసీఈ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

నేడు తపాల ఉద్యోగుల సంఘం మహాసభ

అనంతపురం సెంట్రల్, మే 24(ఆంధ్రజ్యోతి): అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం(ఏఐజీడీఎస్‌యూ) మహాసభను ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం డివిజన్ సెక్రెటరి కృష్ణయ్య యాదవ్ శనివారం ప్రకటనలో తెలిపారు. అనంతపురం డివిజన్, గుంతకల్లు బ్రాంచ్ సంయుక్త 8వ వార్షిక మహాసభలో గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ పార్థసారథితోపాటు ఏఐజీడీఎస్‌యూ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, మహాదేవయ్య హాజరు కానున్నట్లు తెలిపారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

- ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి
- ప్రజా సంఘాల జేఏసీ నాయకులు


నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆదివాసి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజాసంఘాల జేఏసీ నాయకులు కోరారు. శనివారం నగరంలోని బుద్ధవిహార్ పార్కులో 'మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి' అన్న అంశంపై జేఏసీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. అడవుల్లోని ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు కట్టబెట్టాలన్న ఒప్పందంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో వేలాదిమంది ఆదివాసీలను నిర్దాక్షిణ్యంగా మట్టుబెడుతున్నారని అన్నారు. మావోయిస్టులను బూచిగా చూపుతూ ఎక్కడికక్కడ కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కట్టుకథలల్లడం పరిపాటిగా మారిందని విమర్శించారు. విలువైన ఖనిజ సంపదలు కొల్లగొట్టే ప్రయత్నంలో అడ్డుతగులుతున్న మావోయిస్టులను సైతం చంపేస్తున్నారని తెలిపారు. వేలాదిమంది కేంద్ర బలగాలతో అడవులను చుట్టుముట్టి నెలల తరబడి గాలిస్తూ పచ్చటి అడవులను ఎర్రటి నెత్తురుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆపరేషన్ కగార్, గ్రీన్ హంట్, బూటకపు ఎన్‌కౌంటర్లపై వామపక్ష పార్టీలు, ప్రజాస్వామిక, అభ్యుదయ వాదులు, కుల, ప్రజా, విద్యార్థి, మహిళా సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి, ఇతర ప్రజాసంఘాల నాయకులు కేపీ రాజు, వేమన, టీపీ రెడ్డి, చిందలూరి రామాంజులు, చంద్రప్ప, చంద్రచర్ల హరి, శంకర్ కుళ్లాయప్ప, నాగరాజు, రామకృష్ణ, సూర్యనారాయణ, నరేంద్ర పాల్గొన్నారు.

సవాళ్లు కాదు..నీళ్లు సాధించండి

- హంద్రీనీవా కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

గుంతకల్లుటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాపై ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకోవడం కాకుండా ఉమ్మడి జిల్లాలో 3.5 లక్షల ఎకరాలకు సాగు నీటి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్ హితవు పలికారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకూ హంద్రీనీవా కాలువ లక్ష్యం నెరవేరలేదన్నారు. వర్షాలు తక్కువగా వచ్చే కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాల్సి ఉందని, కానీ ఒక ఎకరాకు కూడా ఇవ్వలేదన్నారు. హంద్రీనీవా కాలువ నుంచి కృష్ణజలాలు ఉమ్మడి జిల్లాకు వస్తున్నాయంటే దానికి రైతు సంఘాలు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల దశాబ్దాల పోరాటమే కారణమన్నారు. హంద్రీనీవా నుంచి కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా 114 చెరువులకు నీరు ఇవ్వాలన్నారు. భైరవతిప్పా ప్రాజెక్టుకు వెంటనే నీరు ఇవ్వాలన్నారు. పిల్ల కాలువల పనులు పూర్తిచేయాలన్నారు. హంద్రీనీవా నీటిని పూర్తి స్థాయిలో సాధించడానికి అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయకార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 237558

ఉచిత విద్యావకాశాలు
ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్:9030661651.
AJA- 237555

ENGLISH SHORTHAND COACHING
For Staff Selection Commission (SSC) High Court, Districts Courts, State and Central Government Stenographer Jobs. Contact No : 9849636046
AJA-Sathish

FLAT FOR SALE
2BHK Flat for sale at Gokulam Residency,Hari Hara Temple Road, Ashok Nagar ATP.Flat No.306 With Car Parking Cell.9381911766.
AJA-Sathish

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

న్యూస్ బాక్స్

దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం, మే 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన కురుబ విద్యార్థులకు ఈనెల 29న ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు యశోదమ్మ వకీలు పెద్దయ్య కురుబ కల్యాణ మండపం కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇంకా దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

పరీక్షకు 608 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మే 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 608 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు డీఈఓ కిష్టప్ప ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 34 పరీక్షా కేంద్రాల్లో 3,571 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 2,963 మంది పరీక్షలు రాశారన్నారు. అదేవిధంగా ఒకేషనల్ పదో తరగతి పరీక్షలు ఏడు కేంద్రాల్లో నిర్వహించామని, 105 మంది విద్యార్థులకు గాను 69 మంది ఈ పరీక్షలు రాశారని, 36 మంది గైర్హాజర్ అయ్యారని తెలిపారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలు నాలుగు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించామని, 83 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 64 మంది పరీక్షలకు హాజరయ్యారని, 19 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

సచివాలయానికి సామగ్రి అందజేత

ధర్మవరం, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదోవ వార్డు సచివాలయానికి 7వ వార్డుకు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త వేల్పుల తులసీదాస్ రూ. ఐదు వేల విలువైన స్టేషనరీని అందజేశారు. ఏ4సైజు పేపర్ బండిల్స్, ఫైల్ ర్యాకెర్స్, పెన్నులు, నోట్‌బుక్స్, ప్యాడ్స్ తదితర సామగ్రిని సచివాలయ సిబ్బందికి అందజేశారు.

యోగా దినోత్సవం

కొత్తచెరువు, మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణంలో యోగా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి శివరంగప్రసాద్ విచ్చేశారు. ఇందులో అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కషాయాల తయారీలో నిమగ్నం

తనకల్లు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపిక చేసిన 19 గ్రామాల్లో జనజాగృతి సంస్థ ద్వారా కషాయాల తయారీలో రైతులు నిమగ్నమయ్యారు. యేడాదికాలంగా రైతులకు వివిధ పంటలకు ఆశించే చీడపీడల నివారణ కోసం పురుగుమందులు, రసాయనిక ఎరువులు ఉపయోగించకుండా స్థానికంగా లభించే ఆవుపేడ, మూత్రం, వెల్లుల్లి, పచ్చిమిరప, వేప, కానుగ, సీతాఫలం, వావిలాకు తదితర వాటితో తయారు చేసిన కషాయాలను తయారుచేసి.. పంటలకు ఉపయోగిస్తున్నారు. తద్వారా మంచి ఫలితాలు ఉండటంతో.. అనేక మంది రైతులు ప్రస్తుతం ఈ కషాయాల తయారీలో నిమగ్నమయ్యారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

ముదిగుబ్బ, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామస్వామి తండాకు చెందిన తెలుగు మహిళ హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ హేమలతా భాయ్ తండ్రి, టీడీపీ కార్యకర్త చంప్లా నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ రామస్వామి తండాలోని వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు రమేష్‌బాబు, అశ్వర్థరెడ్డి, తుమ్మల మనోహర్, చినగాని నరసింహ యాదవ్, కోట్ల బాబి, మహబూబ్‌పీరా, సూర్యశేఖర్‌రాజు, తుమ్మల సూరి, వెంకటనారాయణ, కరుణాకర్ ఉన్నారు.

● బాధిత కుటుంబానికి ..

బత్తలపల్లి : మండలంలోని ఎం చెర్లోపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చిట్రా ఓబులేశు కొద్ది రోజుల క్రితం విద్యుదాఘాతంతో మరణించాడు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ శనివారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు నారాయణరెడ్డి, గంటాపురం జగ్గు, కేశవ, శ్రీరాములు, సురేంద్ర ఉన్నారు.

● మాజీ ఎంపీటీసీకి ...

నంబులపూలకుంట : మండలంలోని పికొత్తపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ సోమిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

సోలార్ ఏర్పాటుకు ఎకరాకు రూ.31 వేలు

నంబులపూలకుంట, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలో సోలార్ ఏర్పాటు చేసుకోవడానికి రైతులు ఎవరైనా ముందుకు రావచ్చని తహసీల్దార్ దేవేంద్రనాయక్ శనివారం తెలిపారు. ఎకరానికి యేడాదికి రూ.31 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. 2,500 ఎకరాలను గుర్తించిందని, ఎవరైనా రైతులు ఆసక్తి ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు. రెండు సంవత్సరాల తరువాత ఐదు శాతం పెంచుతారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో అన్యాయం

నంబులపూలకుంట, మే 24(ఆంధ్రజ్యోతి): బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ప్రభుత్వం అసంబద్ధ నిర్ణయాలు, నిబంధనలతో ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగోన్నతుల్లో ఎస్‌జిట, స్కూల్ అసిస్టెంట్ సర్వీసును లెక్కించేందుకు అనుమతిస్తూ, వాటికి బదిలీలో ఎస్‌జిటిల నుంచి సర్వీస్‌ను ప్రాతికంగా తీసుకుంటూ పాయింట్లు కేటాయిస్తున్నారన్నారు. మరోవైపు ఒక డిఎస్సీలో ఎస్‌జిటిగా ఉద్యోగం పొంది, అనంతరం స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైనవారిని స్కూల్ అసిస్టెంట్ సర్వీసులు మాత్రమే బదీల్లో పాయింట్లు కేటాయిస్తూ ద్వంద్వైఖరి ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎస్‌టీయూ జిల్లా కౌన్సిలర్ రమణ నాయక్, మురళీ, పర్వతరెడ్డి, రమణారెడ్డి, రిజ్వానుల్లాఖాన్, షఫీ, సుందర్శన్‌గోపాల్, శంకర్‌నారాయణ, నాజార్డన్, చిట్టెమ్మ, ఇక్బాన్,సీతారత్నం పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

నంబులపూలకుంట, మే 24(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రాలో పాల్గొనే వారు పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ శనివారం తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న కలెక్టర్ ఆధ్వర్యంలో లేపాక్షిలో నిర్వహించబోతున్నారని, అందులో పాల్గొనే వారు యోగాంధ్రా లింక్ ద్వారా పేర్లు మోదు చేసుకోవాలన్నారు. ఇతర ప్రాంతాల్లో యోగాలో పాల్గొనేవారు ఈ లింక్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

లీకేజీ నీటితో ప్రమాదాలు

బుక్కపట్నం, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లపల్లికి వెళ్లే రహదారిలో పంచాయతీ బోరు ద్వారా లీక్ అయిన నీరు ప్రవహిస్తోందని ఆ గ్రామస్థులు వాపోయారు. చాలా రోజులుగా ఇలా నీరు లీక్ అయి .. రోడ్డుపై పారుతుండటంతో ఆ రోడ్డు పచిపట్టిందని, పలువురు బైక్‌దారులు జారి పడి గాయపడ్డారని అన్నారు. శనివారం కూడా బుక్కపట్నం వస్తున్న ఓ యువకుడు బైక్ అదుపు పడి .. తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. లీకేజీ నీటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి సిద్దిక్‌బాషాకు శనివారం వినతి పత్రం అందజేశారు.

రావులచెరువులో గ్రామసభ

ధర్మవరంరూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన రావులచెరువులో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు శనివారం గ్రామసభ నిర్వహించారు. ప్రజలందరూ గొడవలకు దూరంగా ఉండి ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



నీరుకుంట్లపల్లిలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం



కటారుపల్లిలో ఆగిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం

పనులు పూర్తయ్యేదెన్నడో..!

● ఆగిపోయిన నాడు-నేడు రెండో విడత పనులు
● వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
● బిల్లుల చెల్లించకపోవడమే కారణం
● అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణం
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
● 12న పాఠశాలలు పునఃప్రారంభం

గాండ్లపెంట, మే 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల వ్యాప్తంగా రెండో విడతలో పాఠశాలల్లో చేపట్టిన నాడు నేడు పనులు నేటికీ పూర్తి కాలేదు. రెండో విడతగా అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలు, పాఠశాలల అదనపు తరగతి గదులు, వివిధ మరమ్మతులను ఆ ప్రారంభం చేపట్టింది. రెండో విడత నాడు నేడు పనులకు రూ.6.49, 75,000 నిధులు కావాల్సి ఉండగా.. వైసీపీ ప్రభుత్వం రూ.367.12 కోట్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో ఆ పనులన్నీ ఆగిపోయాయి.

● 21 పాఠశాలల్లో ..

తాళ్లకాలువ, తూపల్లి, నల్లగుట్టతండా, గాండ్లపెంట -4, పత్రవాండ్లపల్లి, అరమడకవారిపల్లిలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు చేపట్టింది. అలాగే పెద్దతండా, రెడ్డివారిపల్లి, వడ్డిరెడ్డిపల్లి, గాజులవారిపల్లి, కటకంవారిపల్లి, కోటపల్లి, బనాన్‌చెరువుపల్లి, సోమయాలపల్లిలో ప్రాథమిక పాఠశాలలు, సామచేనేబైలు, గాండ్లపెంట, గొడ్డివెలగల ప్రాథమికోన్నత పాఠశాలలు, రెక్కమాను, నీరుకుంట్లపల్లి, కేజీబీవీ, కటారుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రహరీలు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు, పాతభవనాలకు మరమ్మతులకు నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండలంలో మొత్తం 56 పాఠశాలలు ఉండగా.. అందులో 21 పాఠశాలల్లో ఈ పనులు చేపట్టడానికి పూనుకుంది. అయితే ఆ పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. బిల్లులు చెల్లించకపోవడమే ఇందుకు కారణం. ఈ పనులు అర్థాంతరంగా ఆగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయినా నాడు నేడు పనుల్లో ఎలాంటి పురోగతీ లేదు. పాఠశాలలు ప్రారంభమైన తరువాత ఈ పనులు చేపడితే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అంతలోపే ఈ పనులు పూర్తి చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● వివిధ దశల్లో పనులు

నాటి వైసీపీ ప్రభుత్వం రెండో విడతలో చేపట్టిన పనులకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో అవి ఆగిపోయాయి. ప్రధానోపాధ్యాయులు ఇసుక, కంకర, పలు వస్తువులను కొనుగోలు చేశారు. అయితే సిమెంటు సకాలంలో అందించకపోవడంతో ఆ పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. ప్రధానోపాధ్యాయులు పనులు చేయించడానికి బిల్లులు రాకపోవడంతో ముందుకు రాలేదు. మరుగుదొడ్ల పనులు పూర్తి కాలేదు. కొన్నిచోట్ల పూతలు, మరికొన్నిచోట్ల బేసిన్లు, టైల్స్ పనులున్నాయి.

బిల్లులు రాగానే పనులు

అంగన్‌వాడీలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలో వివిధ దశల్లో పనులు ఆగిపోయాయి. బిల్లులు, సిమెంటుగా రాగానే ఆ పనులు చేయించడానికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారు.

\- క్రిష్ణానాయక్, ఎంఈఓ

జీతాల కోసం పారిశుధ్య కార్మికుల రిలేదీక్షలు

● రెండేళ్లుగా అందని వైనం ● పచ్చగడ్డి తింటూ వినూత్న నిరసన

గాండ్లపెంట, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు తకు జీతాలు చెల్లించాలని స్థానిక పోలీస్ స్టేషన్ వద వారం రోజుల నుంచి రిలేదీక్షలు చేపట్టారు. శనివారం వారు పచ్చగడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ దీక్షలకు రైతు సంఘం నాయకులు కెకె. రాజారెడ్డి, ఖాదర్ బాషా మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఈ పారిశుధ్య కార్మికులకు రెండు సంవత్సరాలుగా జీతాలు అందడం లేదన్నారు. దీంతో వారి కుటుంబ పోషణ దుర్భరంగా ఉందన్నారు. వెంటనే అందరికి జీతాలు చెల్లించాలని కోరారు. ఈ దీక్షలో పారిశుధ్య కార్మికులు నరసింహ, కదిరప్ప, దొడ్డెప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.



పచ్చగడ్డి తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

వీధి కుక్కల బెడద



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

అమడగూరు (కదిరి), మే 24 (ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలం మహమ్మదాబాద్‌లో వీధికుక్కలు ఎక్కువయ్యాయని, వాటి బారి నుంచి కాపాడాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో కుక్కల సంఖ్య దాదాపు రెండువందలకు చేరిందని, దీంతో గ్రామంలో తిరగాలంటేనే భయంగా ఉంటోందని ఆ గ్రామస్థులు తిరుపాల్, నరసింహులు వాపోయారు. ద్విచక్రవాహనాల్లో వెళ్లేవారిని వెంబడించి.. గాయపరుతున్నాయన్నారు. వాటి బారి నుంచి తప్పించుకోవడానికి బైక్‌ల్లో వేగంగా వెళ్తూ అనేక మంది కింద పడి గాయపడ్డారన్నారు. అంతేకాకుండా గ్రామంలో ఉన్న గొర్రెల మందలోకి చొరబడి చంపుతున్నట్లు చెప్పారు. రాత్రి 8 గంటలైతే ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావడానికి జంకుతున్నారన్నారు. వీటిని కట్టడి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జానకీని వివరణ కోరగా .. కుక్కలకు కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టామని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఖాద్రీ ఆలయం కిటకిట

కదిరిఅర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక నుంచీ భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి దర్శనానికి వచ్చారు. గంటలకొద్ది స్వామి దర్శనానికి భక్తులు క్యూలో వేచి ఉన్నారు.



స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

ప్రమాదాలకు నెలవు ... ఈ స్పీడ్ బ్రేకర్లు

తొలగించాలని వాహనదారుల వినతి

ముదిగుబ్బ, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు .. ప్రవమాదాలకు నెలవుగా మారాయి. కదిరి నుంచి ముదిగుబ్బ రహదారిలో మలకవేముల క్రాస్‌లో ప్రమాదాలు నివారించేందుకు త్రిబుల్ స్టెప్స్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. రద్దీగా ఉండే ఈ మార్గంలో ఇలా మూడు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో.. వాటిపై వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నాయి. ద్విచక్ర వాహనాలతో పాటుగా మిగతా వాహనాలు కూడా అదుపుతప్పి ప్రమాదాలకు గురైన సంఘనలు అనేకమున్నాయి. దీనికి తోడు స్పీడ్ బ్రేకర్లకు ఒకవైపు రోడ్డు గుంతలు ఉండటంతో వాహనదారులు తప్పనిసరిగా వాటిపై వెళ్లాల్సి ఉంది. వీటిపై వెళ్లే సమయంలో వాహనాలు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొంటున్నాయి.

వీటి ద్వారా ప్రతి రోజూ స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు సింగి ల్ స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



మలకవేముల క్రాస్‌లో ప్రమాదాలకు కారణమవుతున్న త్రిబుల్ స్టెప్ స్పీడ్ బ్రేకర్లు

కొనసాగిన రిలేనిరాహారదీక్ష

ధర్మవరంరూరల్, మే24(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషన్ కార్మికులు చేపట్టిన రిలేనిరాహార దీక్ష శనివారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సకలరాజా హాజరై మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పెనుకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక భోగసముద్రం చెరువు వద్దున వెలసిన దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేకంగా పూజలు, అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.





మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

భూములు కోల్పోయిన రైతుల వివరాలివ్వండి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య

ముదిగుబ్బ, మే 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి (342) విస్తరణలో భూములు కోల్పోయిన రైతుల వివరాలు త్వరగతిన పంపాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నారాయణ స్వామి, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధిత రైతులతో నివేదికను సమగ్రంగా తయారు చేయాలని, వివరాలు అందిన వెంటనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు

క్రైం న్యూస్..

బాలిక అదృశ్యం

బత్తలపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె (17) కనిపించడం లేదని బత్తలపల్లిలోని బీసీ కాలనీకి చెందిన దంపతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి తమ ఇంట్లో తమ కుమార్తెతో కలిసి పండుకున్నామని, అర్ధరాత్రి చూడగా.. తమ కుమార్తె కనిపించలేదని వాపోయారు. చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.



హెల్ప్ లైన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు

ధర్మవరం, మే 24(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్-257 ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయ బదిలీల హెల్ప్‌లైన్ సెంటర్‌ను స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బీకే ముత్యాలప్ప మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన ఆన్‌లైన్‌లో నమోదు, అందులోలో వచ్చే సమస్య పరిష్కరించేందుకు ఈ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, స్టేట్ కౌన్సిలర్ శ్రీనివాసులు, జిల్లా ఆడిటర్ నాగభూషణం, ధర్మవరం మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, ప్రధానకార్యదర్శి శివానంద, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనకాయలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీఐటీయూ, సీపీఎం నాయకులు

ఓబుళదేవరచెరువు, మే 24(ఆంధ్రజ్యోతి): కరువుతో అల్లాడుతున్న రైతులకు ఈ యేడు ఖరీఫ్‌లో 90శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ సరఫరా చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. శనివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీపీఎం నేత సున్నపల్లి రమణ స్థానికంగా మీడియాతో మాట్లాడారు. ముందస్తుగా వర్షాలు పడటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారని, అయితే ఇంతవరకు విత్తన వేరుశనగ పంపిణీ ఏర్పాట్ల ప్రక్రియ ప్రారంభం కాలేదని అన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు అందించలేదన్నారు. పెట్టుబడి సాయం కూడా ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. బ్యాంక్‌లో రుణాల రెన్యువల్ చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నేతలు కుళ్లాయప్ప, గంగులప్ప, రైతులు రామక్రిష్ణ, శంకర్, రామాంజి, కొండప్ప, అనంత్, సత్యప్ప పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఫీజులు తగ్గించండి



స్కూల్ యాజమానులతో మాట్లాడుతున్న హరీశ్‌బాబు

ధర్మవరం, మే 24(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఫీజుల విషయంతో వెసులుబాటు కల్పించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు కోరారు. శనివారం స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో ప్రైవేటు స్కూల్ యాజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక మంది కూలీలు, కార్మికులు, రైతులు వారివారి పిల్లలకు మంచి భవిష్యత్ ఇవాలని ఆశతో తలకు మించిన భారమైనా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని, అలాంటి వారికి ఫీజుల విషయంలో వెసులుబాటు కల్పించాలని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు.

అర్హులకు ఇంటిపట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

తనకల్లు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతపల్లి గ్రామ సర్వేనెంబర్ 183-ఏ లో గుడిసెలు వేసుకున్న వారందరికి వెంటనే పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఐదేళ్లుగా సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి పట్టాల కోసం పోరాటాలు చేస్తున్నా.. రెవెన్యూ అధికారులు స్పందించడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రెడ్డెప్ప, రైతు సంఘం చౌడప్ప, కార్యకర్తలు, నాయకులు నిరుపేదలు ఉన్నారు.

సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు

సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ హెచ్చరిక

నల్లచెరువు (కదిరి), మే 24(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త హెచ్చరించారు. నల్లచెరువులోని సచివాలయం-2ను ఆయన శనివారం తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ మధుశ్రీ, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయకాంత్‌రెడ్డి ఎందుకు విధులకు హాజరుకాలేదని మండిపడ్డారు. వెంటనే వారికి ఫోన్ చేసి.. నిలదీశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ల, చర్యలు తీసుకుంటామన్నారు.



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

న్యూస్ బాక్స్

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక భోగసముద్రం చెరువు వద్దున వెలసిన దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేకంగా పూజలు, అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

సబ్సిడీ విత్తనాలు అందించాలి



ఆర్ఎస్‌కే సిబ్బందికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సోమందేపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలవారికి సబ్సిడీతో విత్తనాలు అందించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. శనివారం రైతు భరోసా కేంద్రాలవద్దకు చేరుకుని సిబ్బంది బాబావలికి వినతిపత్రం అందించారు. అనంతరం ఫోన్‌ద్వారా ఏఓ కవితారాణికి సమాచారం అందించారు. నాయకులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ముందస్తు వర్షాలు కురుస్తున్నందున సన్న, చిన్నకారు రైతులు పొలాల్ని దుక్కిచేసుకుని విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. నాయకులు పెద్దన్న, హనుమయ్య కొండా వెంకటేశు, రామక్రిష్ణ, నాగరాజు, బెస్త కిష్టప్ప, వెంకటేశు, కిష్టప్ప, కంచె శ్రీనివాసులు, మేసే నాగరాజు పాల్గొన్నారు.

జిల్లా మహానాడుకు తరలిన తెలుగుతమ్ముళ్లు

అగళి, మే 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లాలో శనివారం జరిగిన మహానాడుకు జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమారస్వామి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. మడకశిర నియోజకవర్గం నుంచి కూడా వేలాది మంది తరలి వెళ్లారు.

గుడిబండ: సత్యసాయి జిల్లా మామిళ్లకుంట క్రాస్‌వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహానాడుకు గుడిబండ మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. కన్వీనర్ మద్దనకుంటప్ప ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున వెళ్లారు.

కనిపించని హెచ్చరిక బోర్డులు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు



కోడూరు తోపులో ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్లు

చిలమత్తూరు, మే 24(ఆంధ్రజ్యోతి): కోడూరు తోపు కూడలిలో ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. 44వ జాతీయ రహదారి రెండో దశ తారు ఏర్పాటులో భాగంగా స్థానికుల డిమాండ్‌తో ఇక్కడ స్పీడు బ్రేకులు ఏర్పాటుచేశారు. అయితే అవి దూరానికి సరిగా కనపడకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు వాటిని గమనించకుండా స్పీడు బ్రేకులపై దూసుకెళుతున్నాయి. దీంతో వాహనాలు అతివేగంగా వచ్చి ఎగిరిపడుతున్నాయి. వాహనాల డ్రైవర్లు వాటిని కంట్రోల్ చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా స్పీడు బ్రేకర్లు ఉన్నట్లు తెలుసుకోవడం కోసం కొంత దూరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తే ప్రమాదాలు జరగవని స్థానిక ప్రజలు అంటున్నారు. కొడికొండ చెక్‌పోస్టు, కోడూరు కూడలిలో వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

అర్ధంతరంగా ఆగిన రోడ్డు పనులు



నిలిచిపోయిన మోటువారిపల్లి రోడ్డు పనులు

పెనుకొండ రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా చూడని తారు రోడ్డు గ్రామస్థులకు తారు రోడ్డు వేయిస్తామని మంత్రి సవిత మాటిచ్చారు. దీంతో రూ.1.60కోట్ల నిధులతో తారు రోడ్డు పనులను నెల క్రితం ప్రారంభించారు. రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే మట్టిరోడ్డులో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చిన్నప్పరెడ్డిపల్లి, మోటువారిపల్లి గ్రామస్థులు అంటున్నారు. కాంట్రాక్టర్ రోడ్డుపనులు నిర్లక్ష్యంగా చేయడంతో సమస్యగా మారిందన్నారు. దీనిపై పంచాయతీరాజ్ డీఈ వెంకటరమణను వివరణ కోరగా వర్షాలు వస్తున్నందున పనులు ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. నెలరోజుల్లోపు తారు రోడ్డు పూర్తిచేస్తామని తెలిపారు.

పరీక్షకు 608 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మే 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 608 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ కిష్టప్ప ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 34 పరీక్షా కేంద్రాల్లో 3,571 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 2,963 మంది పరీక్షలు రాశారన్నారు. అదేవిధంగా ఒకేషనల్ పదో తరగతి పరీక్షలు ఏడు కేంద్రాల్లో నిర్వహించామని, 105 మంది విద్యార్థులకు గాను 69 మంది ఈ పరీక్షలు రాశారని, 36 మంది గైర్హాజర్ అయ్యారని తెలిపారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలు నాలుగు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించామని, 83 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 64 మంది పరీక్షలకు హాజరయ్యారని, 19 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.



వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత



జిల్లా మహానాడుకు ర్యాలీగా వెళ్తున్న మంత్రి

లోకేశ్ ఆశయాలను అమలు చేస్తాం: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): యువతనే మంత్రి నారాలోకేశ్ ఆశయాలను ముందుకు తీసుకెళతామని మంత్రి సవిత అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో చిరు వ్యాపారులకు 44తోపుడు బండ్లు, టిఫెన్ సెంటర్ బండ్లను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. చిరువ్యాపారులకు తోపుడుబండ్లు అద్దెకు తెచ్చుకుంటే రోజుకు రూ.200 ఖర్చవుతుందని ప్రతినెలా రూ.6వేలు తోపుడుబండ్లకే చెల్లించాల్సి వస్తుందన్నారు. వీరి సమస్యను గుర్తించి వ్యాపారులకు ఉచితంగా తోపుడుబండ్లు అందించామన్నారు.

ప్రాచీన ఆలయాలను పునరుద్ధరించాలి

● చరిత్రకారుడు మైనాస్వామి

గోరంట్ల, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు రహదారిలో మల్లెల గుట్టపై ఉన్న విజయనగర కాలంనాటి ఆలయాలను పునరుద్ధరించాలని పర్యాటక, పురావస్తు, సాంస్కృతిక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్‌కు విజ్ఞప్తి చేసినట్లు చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. గోరంట్లలోని మాధవరాయ ఆలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రాచీన ఆలయాలను పునరుద్ధరించి, పూర్వ వైభవం తీసుకురావాలని వినతిపత్రం అందిచేయగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. క్షేత్రస్థాయిలో పురావస్తు శాఖాధికారులచే సర్వే నిర్వహిస్తామని చెప్పారన్నారు. మల్లెల గ్రామం వద్దనున్న గుట్టపై విజయనగర శైలిలో రెండు ఆలయాలు నిర్మించారన్నారు. ఒక గుడి మాధవరాయుల సన్నిధి కాగా, మరోగుడితోపాటు రెండు గుళ్ల విధ్వంసానికి గురయ్యాయన్నారు. ఆలయం ముందు బండరాయిపై విజయనగర సామ్రాజ్యపు ప్రభుత్వ రెండవ వెంకటపతి రాయులు సామాన్య శకం 1638లో రాయించిన భూదాన శాసనం ఆలయ ప్రాశస్త్యాన్ని చూడవచ్చన్నారు.



పురావస్తు శాఖ కార్యదర్శి అజయ్‌జైన్‌కు వినతి పత్రం ఇస్తున్న మైనాస్వామి

జ్ఞానసంపన్నుడు అంబేడ్కర్

సాంఘిక సంక్షేమ శాఖ సలహాదారుడు వెంకటయ్య

పావగడ, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత జ్ఞానసంపన్నుడు అంబేడ్కర్ అని విశ్రాంత ఐఏఎస్ అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ సలహాదారుడు డాక్టర్ వెంకటయ్య అన్నారు. శనివారం అంబేడ్కర్ భవన్‌లో నూరపనేని విద్యాసాగర్ ఫౌండేషన్, క్రైస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు ప్రతిభా పురస్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న వారంతా తమ యవ్వన స్థితిలో తమ శక్తియుక్తిని విజయం కోసం వినియోగించుకున్న వారే కానీ, ప్రేమ సేవ అనే పేరిట కాలాన్ని వృథా చేయలేదన్నారు. ఈ విషయాన్ని ప్రతి విద్యార్థి తమ భవిష్యత్తును రూపొందించుకోవడానికి తగిన సమయమన్నారు. ఇంటర్‌లో తమ జీవిత లక్ష్యాన్ని ఎంచుకునేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకుంటామో, జీవితంలో అదే కొనసాగుతుందని సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేష్ అన్నారు. 90శాతం మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు తమ సంస్థ ద్వారా అందించి మానవత్వం చాటుకున్నారు. ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న వెంకటయ్య

కార్యవర్గం ఎంపిక



క్లబ్ సభ్యులను సన్మానిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

పెనుకొండ, మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక అఫిషియల్ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపికైంది. క్లబ్ అధ్యక్షుడిగా కేశవయ్య, జాయింట్ కార్యదర్శిగా కురుబ నంజుండప్పలను శనివారం టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఉదయం కేశవయ్య స్వగృహానికి వెళ్లిన టీడీపీ నాయకులు కన్వీనర్ శ్రీరాములు, పులగూర్ల శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, నారాయణనాయక్, చంద్రాయుడు, సోము, దాస్, షమున్, నజీర్, అంజినప్ప, బీజేపీ నాయకులు రామాంజనేయులు కేశవయ్య, నంజుండప్పలకు పూలమాలలు వేసి సత్కరించారు.

బడిలో అసాంఘిక కార్యకలాపాలు



కూలిపోయిన జడ్పీ పాఠశాల ప్రహరీ

పరిగి, మే 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాఠశాల ప్రహరీ కూలిపోవడంతో రాత్రివేళల్లో ప్రజలు బహిర్భూకి వెళుతున్నారు. అలాగే మద్యం సేవించడం లాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై హెచ్‌ఎం కృపాస్వతరాజ్‌ను వివరణ కోరగా ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరవ్వగానే నిర్మాణం చేపడతామన్నారు.

వ్యవసాయ పనుల్లో అన్నదాత బిజీ



ట్రాక్టర్‌తో భూమిని చదును చేస్తున్న రైతు

అగళి, మే 24(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో ముంగారు సేద్యానికి అన్నదాతలు సిద్ధమయ్యారు. మండలంలోని కురసొంగనపల్లి గ్రామానికి చెందిన రైతు నాగరాజు పంట సాగుకు సిద్ధమయ్యాడు. పొలాన్ని చదును చేసుకుని విత్తనాల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపాడు. ప్రభుత్వం ఇప్పటి వరకు విత్తన వేరుశనగ సరఫరా చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశాడు.

కేఎస్ ఆర్టీసీ బస్సు.. బొలెరో ఢీ





దెబ్బతిన్న బొలెరో వాహనం, బోల్తాపడిన కేఎస్‌ఆర్టీసీ బస్సు

పావగడ, మే 24(ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఆర్టీసీ బస్సు బొలెరోను ఢీకొన్న ఘటనలో బస్సు బోల్తాపడి డ్రైవర్, రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం రాత్రి కుందుర్పి మండలం బెస్తరపల్లి గ్రామానికి రామాంజనేయులు మామిడికాయలను బొలేరో వాహనంలో కోలారుకు తరలిస్తుండగా చళ్లకెరె క్రాస్ వద్ద కేఎస్‌ఆర్టీసీ బస్సు బొలెరో వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్ రామాంజనేయులు, మరో రైతు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బొలెరో డ్రైవర్‌ను పావగడ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓటుతోనే దళితులకు రాజ్యాధికారం

పావగడ, మే 24(ఆంధ్రజ్యోతి): ఓటుతోనే దళితులు రాజ్యాధికారం చేపట్టవచ్చని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. శనివారం తాలూకా పరిధిలోని సాసులకుంటలో అంబేడ్కర్ 134, బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకప్పుడు కులవృత్తుల ఆధారంగా మనుషులు మనోభావాలను పరిగణించి అధికారం చలాయించే వారన్నారు. 1946లో ఓటు హక్కు ప్రతి ఒక్కరికి కల్పించాలని అంబేడ్కర్ ఎన్నో కష్టాలు పడి దేశంలో మొదటిసారి ఓటు హక్కు వినియోగాన్ని అమలు చేసిన ఆదర్శప్రాయుడని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి శూలయ్య, రుద్రప్ప, తుమకూరు జిల్లా అధ్యక్షుడు అంజన్నమూర్తి, ప్రధాన కార్యదర్శి హనుమంతరాయ, తాలూకా అధ్యక్షుడు తిప్పేస్వామి, కోశాధికారి పద్మ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి

నిత్యావసర సరుకులు సక్రమంగా అందించండి

అగళి, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌకధాన్యపు దుకాణాల్లో నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ సుబ్బారావు, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి డీలర్లకు సూచించారు. మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బయోమెట్రిక్ తీసుకుని సరుకులు సరిగా ఇవ్వలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. జూన్1 నుంచి 15వ తేదీ వరకు ఎఫ్‌పీ షాపులలో సరుకులు పంపిణీ చేయాలన్నారు.

మడకశిర టౌన్: రేషన్‌కార్డు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ కరుణాకర్ సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు, వచ్చే నెల నుంచి రేషన్ షాపులలోనే నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలన్నారు. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి పంపిణీ ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మీనారాయణ ఉన్నారు,



మడకశిరలో మాట్లాడుతున్న తహసీల్దార్ కరుణాకర్

ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయండి

● న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్



మాట్లాడుతున్న న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం, మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలులో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని జైలు అధికారికి హిందూపురం సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్ ఆదేశించారు. శనివారం సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. న్యాయాధికారి జైలులో ఉన్న ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటి నుంచి ఉన్నారు, ఏఏ కేసులో ఉన్నారనే దనిపై ఆరాతీశారు. న్యాయాధికారి మాట్లాడుతూ జైలుకు వచ్చిన వారిలో మార్పు రావాలన్నారు. బయటికి వెళ్లాక సమాజంలో మీకు చిన్నచూపు చూస్తారన్నారు. మీ కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతుంటారన్నారు. క్షణికావేశంలో తప్పులు చేసి స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగడంవల్ల ఆర్థికంగా చితికిపోతారన్నారు. బయటికి వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. జైలులో ఉన్న వారి ఆరోగ్యంపట్ల ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్య పరీక్షలు చేయించాలని జైలు అధికారి హనుమప్పకు సూచించారు. సబ్‌జైలులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు కళావతి, పార్వతి, భరత్‌సింహా, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం



కాలిపోతున్న ద్విచక్రవాహనం

లేపాక్షి, మే 24(ఆంధ్రజ్యోతి): చోళసముద్రం సమీపంలో జాతీయరహదారిపై శనివారం ద్విచక్రవాహనం దగ్ధమైంది. గ్రామస్థులు తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి చెందిన రామక్రిష్ణ హిందూపురం నుంచి ద్విచక్రవాహనంలో బాగేపల్లికి వెళుతున్నాడు. చోళసముద్రం వద్దకు రాగానే ద్విచక్రవాహనానికి ఉన్న సైడ్‌బ్యాగ్‌లోంచి ఒక్కసారిగా మంటలు చలరేగాయి. దీంతో వాహనదారుడు వాహనాన్ని వదిలేసి పక్కకు దూకి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బ్యాగులో అదనంగా పెట్రోల్‌గాని ఏదైనా ఉన్నాయా, లేదా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మే 24(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో శనివారం ఇద్దరు ఆత్మహత్యకు యత్నించారు. గోరంట్ల పట్టణంలోని 1వార్డుకు చెందిన జ్యోతి విషద్రావకం తాగి శనివారం ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ ఉషా చికిత్సలు చేశారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

మడకశిర రూరల్: మండలంలోని ఒంటిపాళ్యం గ్రామానికి చెందిన రంగప్ప ఆస్తి తగాదాల కారణంగా శనివారం ఇంటి సమీపంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు,బంధులు వెంటనే రంగప్పను 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్సలు ఆయన పొందుతున్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ నాయకుడి మృతి



మార్కెట్ బాబు(ఫైల్)

మడకశిర టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు మార్కెట్ బాబు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురి అయి అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతు శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 14వ తేదీన మండలంలోని తడకలపల్లి గ్రామ సమీపంలోని త్రిమూర్తి ఆగ్రోస్ ఫారం వద్ద ద్విచక్ర వాహనంలో వస్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. వెంటనే తుమకూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి ఐసీయూలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి అనంతపురం ఆసుపత్రికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి వెళ్లి పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

ఎడ్లబండిని ఢీకొన్న కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గోరంట్ల, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెంగుళూరు రహదారిలో పాపిరెడ్డిపల్లి వద్ద ఎడ్లబండిని కారు ఢీకొన్న ఘటనలో రైతు నరసింహప్ప, ఒక ఎద్దు గాయపడింది. పాపిరెడ్డిపల్లికి చెందిన నరసింహప్ప శనివారం ఎడ్లబండిపై వెళుతుండగా వెనుకవైపునుంచి కారు ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కొత్తచెరువు మండలంలోని తలమర్లకు చెందిన దీపిక అనే మహిళ స్వగ్రామం నుంచి బెంగళూరుకు కారులో వెళ్తుండగా బండి వెనుకవైపునుంచి ఢీకొంది. ఈఘటనలో రైతు నరసింహప్పతో పాటు ఎద్దు తీవ్రంగా గాయపడింది. నరసింహప్పను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఎద్దుకు పశువైద్యులు చికిత్సలందిస్తున్నారు. ప్రమాదంపై పోలీసులను విచారించగా, తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

వెల్డర్ మృతిపై కేసు నమోదు

గోరంట్ల, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవులచెరువు వద్ద క్రేన్ ప్రమాదంలో వెల్డర్ పట్టురాజు (50) మృతిపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. ఈ ఘటన 22వ తేదీన రాత్రి చోటు చేసుకోగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు తమిళనాడులోని తిరువళ్లురూకు చెందికు పట్టురాజు, సెంథిల్ కుమార్ గోరంట్ల మండలంలో కొంతకాలంగా వెల్డింగ్ పనులుచేస్తున్నరు. వీరు దేవలచెరువు వద్ద వెళ్తుండగా క్రేన్ వారిని ఢీకొనడంతో వారు గాయపడ్డారు. వారిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పట్టురాజు చికిత్స పొందుతూ మృతిచెందారు. సెంథిల్‌కుమార్ బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పట్టురాజుకు సంబంధించి వారు ఫిర్యాదు చేయకపోవడంతో బంధువులకు సమాచారం అందించగా, తమిళనాడునుంచి వచ్చిన ఆయన సోదరుడు రామనాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

హైవేపై యూటర్న్‌ను ఏర్పాటు చేయండి

గోరంట్ల, మే 24(ఆంధ్రజ్యోతి): కదిరి-గోరంట్ల మధ్య నాలుగులైన్ల హైవే పనుల్లో భాగంగా కోరేవాండ్లపల్లివద్ద ప్రజల సౌకర్యార్థం యూటర్న్ ఏర్పాటు చేయాలని ఉప సర్పంచ్ కమలాకర్‌రెడ్డి కోరారు. ముద్దనూరు, హిందూపురం హైవే పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. గోరంట్లనుంచి జక్కసముద్రానికి ఆర్టీసీ నడుస్తోందని, మలసముద్రం, జక్కసముద్రం, గుట్టిపల్లి, తండా, కొలిమిపల్లి, తదితర గ్రామాలకు కోరేవాండ్లపల్లినుంచి వెళ్లాల్సి ఉంటుందన్నారు. అయితే యూటర్న్ ఏర్పాటు చేయకపోవడంతో పై గ్రామాల ప్రజలు గౌనివారిపల్లినుంచి చుట్టు తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. హైవే అధికారులు స్పందించి యూటర్న్ ఏర్పాటు చేయాలని కోరారు.